

అధునాతనమైన ఫింగర్ ప్రింట్ పరికరాలను సిబ్బందికి అందజేస్తున్న సీపీ

## నేర పరిశోధనలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకం

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**

సుబేదారి, మే 15: నేరస్థులను పట్టుకోవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకమని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫింగర్ ప్రింట్ విభాగానికి మంజూరు చేసిన అధునాతన పరికరాలను బుధవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో అధికారులకు సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ఫింగర్ ప్రింట్ విభాగం నూతనంగా ఆటోమేటెడ్ మల్టీ మోడల్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ టెక్నాలజీతో నేరాలకు పాల్పడిన వారి వేలి ముద్రలతో పాటు, కనుపాపలు, ముఖం, పాదముద్రలను సేకరించిన తర్వాత సులువుగా నిందితులను పట్టుకోవచ్చన్నారు. నూతన టెక్నాలజీ పరికరాలను తొలుతగా కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్‌స్టేషన్లకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, శ్రీధర్, రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

**సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సూరి**



నర్సంపేట: పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

ఖిలావరంగల్/నర్సంపేట, మే 15: ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్, శివనగర్ ప్రాంతాల్లో గురువారం సమ్మె వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక, కర్షక లోకానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు మైదం పాణి, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు సాలికొండ మోహన్, నర్సయ్య, ఏలియా, వెంకన్న, మధు, మహేందర్, ప్రశాంత్, వెంకటేశ్, రాజేందర్, రాజు పాల్గొన్నారు. అలాగే, సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ నర్సంపేట పట్టణంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు వరంగల్ రోడ్డు కూడలి నుంచి అంగడి సెంటర్, అంబేద్కర్ సెంటర్ మీదుగా జయలక్ష్మి సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశ్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బానోత్ సాగర్, హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ కార్మికులకు గుదిబండగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు గుంపెల్లి మునీశ్వర్, ఎలకంటి రాజేందర్, కొల్లూరి లక్ష్మీనారాయణ, రాజు, పెరుమాండ్ల రవి, వేణుచంద్, ప్రసాద్, అనిల్, రవి, నవీన్, పైడి, కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

**సమీక్షలో ఎమ్మెల్యే దొంతి**



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, మే 15: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంప్ ఆఫీస్‌లో గురువారం ఆయన సివిల్ సప్లయ్ అధికారులు, జేసీ, కో ఆపరేటివ్ అధికారులతో సమీక్షించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని కోరారు. జిల్లాలోని మిగితా ప్రాంతాల్లో ధాన్యం సేకరణ దాదాపు పూర్తయినందున నర్సంపేట నియోజకవర్గంలో ధాన్యం సేకరణపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సమీక్షలో డీసీఎస్‌వో కృష్ణయ్య, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, డీసీవో నీరజ, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి**

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలో రెడ్డి మహిళా పరపతి సంఘం భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబాలు ఆర్థిక పరిపుష్టిత పొందాలంటే మహిళలు చైతన్యవంతులై పరిశ్రమలు స్థాపించి ఎదగాలన్నారు.

## అధికారిక కార్యక్రమంలో హస్తం నేతలు

- కళాశాల భవన నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన
- ప్రొటోకాల్ పాటించని కాంగ్రెస్ నాయకులు
- వేదికపై కుర్చీల్లో దర్జాగా కూర్చున్న వైనం



వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

వరంగల్‌చౌరస్తా, మే 15: వరంగల్ స్టేషన్‌రోడ్ లోని కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారదతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బాలికల జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం ద్వారా రెండు అంతస్తుల్లో 15 తరగతి గదులతోపాటు 60 టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి ముందుకొచ్చిన అరబిందో ఫార్మా కంపెనీని మంత్రి అభినందించారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా వేదికపై ఆసీనులయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మీసాల ప్రకాశ్ ముందు వరుసలో కూర్చున్నాడు. మాజీ కార్పొరేటర్ భర్త శామంతుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జారతి రమేశ్, కాంగ్రెస్ కార్యకర్త బాబు పాక సదానందం వెనుక వరుసలో కూర్చోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సీహెచ్ అనిల్‌కుమార్, కావటి కవిత, బస్వరాజు కుమారస్వామి, సురేశ్‌జోషి, అరబిందో ఫార్మా కంపెనీ డైరెక్టర్ సదానందరెడ్డి, డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్‌సుమన్, కళాశాల ప్రిన్సిపాల్ శరద్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ గంప అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులకు ఫిట్‌నెట్ పరీక్షలు చేయించాలి

**జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖాధికారి శోభన్‌బాబు**



మాట్లాడుతున్న రవాణా శాఖాధికారి శోభన్‌బాబు

కరీమాబాద్, మే 15: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే స్కూల్ బస్సుల ఫిట్‌నెట్ పరీక్షలు నిర్వహించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖాధికారి శోభన్‌బాబు అన్నారు. రంగశాయిపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో గురువారం స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేని బస్సుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్కూల్స్, కాలేజీ బస్సులను నడిపే డ్రైవర్లను ఎంపిక చేసుకునే విషయంలో యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కనీస అనుభవం ఐదేళ్లకు తగ్గకుండా ఉండడం మంచిదన్నారు. వాహనాల మరమ్మతుల విషయంలో అజాగ్రత్తలు వహించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహన తయారీ సంస్థ నుంచి విడిభాగాలను కొనుగోలు చేసి, తయారీ సంస్థ ఆధీకృత డీలర్ల వద్దే మరమ్మతులు చేయించడం మంచిదని సూచించారు. ఫిట్‌నెస్ కోసం వచ్చే ముందు వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసుకోవడం వల్ల పనిభారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వడుప్సా జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మూర్తి, రాష్ట్ర సలహాదారు భూపాల్‌రావు, బేగ్, రాధాకృష్ణ, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు రమేశ్, ఆర్టీఏ సిబ్బంది శశికాంత్, రవి పాల్గొన్నారు.

## శివశక్తులకు చౌదరి బిరుదాంకిత ప్రదానం



చౌదరి బిరుదాంకిత సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి, తెలంగాణ హిజ్రా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లైలా

కరీమాబాద్, మే 15: ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉర్సుగుట్ట వద్ద చౌదరి బిరుదాంకిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ట్రాన్స్‌జెండర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లైలా హాజరయ్యారు. అనంతరం వారు శివశక్తుల కమ్యూనిటీలోని 33 మందికి చౌదరి బిరుదాంకిత అవార్డులు ప్రదానం చేశారు. శివశక్తుల సంఘంలోని పలువురిని నాయకులు(పెద్దలు)గా గుర్తించి వారికి గౌరవంగా చౌదరి బిరుదు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లవన్ స్వామి, భవానీ, దేవి, రామరాజు, బుచ్చమ్మ, సారిక, మౌనిక, బాబాస్వామి, శేఖర్‌స్వామి, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల శివ శక్తులు, హిజ్రాలు పాల్గొన్నారు.

**బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి**

శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఉర్సు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఐదు రోజుల జిల్లాస్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని మంత్రి కోరారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి అందుకనుగుణంగా పాఠాలు చెప్పాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్‌తేజ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సెంటర్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సుబేదారి, మే 15: హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డు లోటస్ రెసిడెన్సీలో బుధవారం పేకాడుతున్న తొమ్మిది మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని, వారి నుంచి రూ. 34,900, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన సోమ సతీశ్, రంగశాయిపేటకు చెందిన ఈడిశెట్టి ఆనందం, కాంట్రాక్టర్ కుడిపాక సురేందర్, ఖిలా వరంగల్‌కు చెందిన బంగారి శ్రీనివాస్, నెక్కొండకు చెందిన గుంటుపల్లి శ్రీకాంత్, రంగశాయిపేటకు చెందిన అన్నమనేని రవీందర్, నెక్కొండ రెడ్లవాడకు చెందిన ఆవుల చంద్రయ్య, నెక్కొండకు చెందిన వెన్న శ్రీనివాస్, హనుమకొండకు చెందిన లింగాల వాసు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్ తెలిపారు.

## వడదెబ్బతో కార్మికుడి మృతి



సారయ్య(ఫైల్)

గీసుగొండ, మే 15: వడదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్మాలలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల సారయ్య(65) వారం రోజులుగా భవన నిర్మాణ పనులకు వెళ్తున్నాడు. బుధవారం పనులకు వెళ్లిన అతడు వడదెబ్బకు గురయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడు మజ్జిగ తాగి పడుకున్నాడు. అర్ధరాత్రి వాంతులు చేసుకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు.

**ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధం**

ఖానాపురం, మే 15: ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సారి సరిత, సాంబయ్య దంపతులు నిరుపేదలు. వీరు సబ్‌స్టేషన్ వెనకాల రేకుల షెడ్ నిర్మించుకున్నారు. గురువారం ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు చెలరేగి ఇంటికి అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. రూ. 4 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**వివాహిత అదృశ్యం**

నర్సంపేట, మే 15: వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని ఆకులతండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆకులతండాకు చెందిన ధరావత్ రజిత-సక్రు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. గురువారం ఉదయం రజిత పని నిమిత్తం నర్సంపేటకు వచ్చింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో సక్రు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్ కుమార్ తెలిపారు.

**అనుమానాస్పదంగా ఒకరి మృతి**


కరీమాబాద్, మే 15: శివనగర్ ప్రాంతానికి చెందిన గుర్రపు రాకేశ్(29) గురువారం అనుమానాస్పదంగా మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.



ఎమ్మెల్సీ కవితతో కేతిరి రాజశేఖర్

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ఆదివాసీ ఎరుకల సంఘం నాయకుడు

కాశీబుగ్గ, మే 15: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 12న ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం రామంతపురంలో జరిగిన ఎరుకల నాంచారమ్మ కల్యాణ మహోత్సవానికి కవిత వచ్చినందుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, కేతిరి సమ్మక్క, తిరుపతమ్మ, కేతిరి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



తారాచంద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

## ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

రాయపర్తి, మే 15: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై తాము నిరంతరం ఒత్తిడి పెంచుతున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మండలంలోని జేతురాంతండా పరిధి రావులతండాకు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నేతావత్ మన్సూర్‌నాయక్ తండ్రి తారాచంద్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన గురువారం తండాకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా జేతురాంతండాకు చెందిన గుగులోత్ రూప్లానాయక్ కాలుకు శస్త్రచికిత్స జరిగింది. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎర్రబెల్లి కలిసి యోగక్షేమాలు తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. దుబ్బతండా జీపీ పరిధిలోని బడితండాకు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దేదావత్ జగన్‌నాయక్ కుమార్తె వివాహం నేపథ్యంలో వధువును ఆశీర్వదించారు. ఎర్రబెల్లి వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, లేతాకుల రంగారెడ్డి, పూస మధు, శ్రీనివాస్‌రెడ్డి, చందు రామ్‌యాదవ్, ఉబ్బని సింహాద్రి, జీవన్, నేతావత్ రవినాయక్, శ్రీనివాస్‌నాయక్, దేదావత్ వెంకన్న, హరిలాల్, బద్ధం వేణుగోపాల్‌రెడ్డి, అనిల్‌నాయక్ ఉన్నారు.

## ఎండీడీవో కార్యాలయంలో ఊడిన పెచ్చులు

**తప్పిన ప్రమాదం.. శిథిలావస్థలో కార్యాలయ భవనం**

గీసుగొండ, మే 15: గీసుగొండ మండల పరిషత్ కార్యాయలంలోని ఈజీఎస్ ఆఫీసు గదిలో గురువారం స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. టీఏ సుస్మా కంప్యూటర్‌లో పనులు చేస్తూ నందనాయక్‌తండా కూలీలలో మాట్లాడుతున్నది. ఈ సమయంలో ఒక్కసారిగా పెచ్చులూడి కిందపడ్డాయి. గమనించిన ఆమె పక్కకు జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేపట్టాలని అధికారులు కోరుతున్నారు. గతంలోనూ ఇలాంటి ప్రమాదమే జరిగిందని సిబ్బంది తెలిపారు. దీంతో గదుల్లో ఉండి పని చేసేందుకు అధికారులు జంకుతున్నారు.



ఈజీఎస్ గదిలో ఊడిపడిన పైకప్పు పెచ్చులు

## పూడికతీత పనులు పూర్తి చేయాలి

వరంగల్, మే 15: నాలాల పూడికతీత పనులు అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో పూడికతీత పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముంపు నివారణలో భాగంగా చేపట్టిన నాలాల పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 66 డివిజన్లలో సుమారు 350 అంతర్గత డ్రైన్‌లలో పూడికతీత చేపట్టాలన్నారు. పూడికతీసిన మట్టిని ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. అలాగే, మేయర్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో అనధికార లే అవుట్లు వెలియకుండా బల్దియా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ఈ నెల 31 వరకు ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**చేనేత జౌళి శాఖ ఏడీగా శ్రీకాంత్‌రెడ్డి**

పోచమ్మమైదాన్, మే 15: వరంగల్ చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వై.శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. సిద్దిపేట జిల్లా నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా పని చేస్తున్న రాఘవరావు రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డిని కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## కొత్తవాడలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పోచమ్మమైదాన్, మే 15: వరంగల్ కొత్తవాడ ఆటోనగర్‌లోని ప్రభుత్వ గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, నాగేశ్వరి, ఉపేందర్‌రెడ్డి, షర్ఫోద్దీన్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**HOUSE FOR SALE**

★Property for sale at Kishanpura near Chaitanya Degree College Hanamkonda, Warangal Urban Ground floor 2 BHK and 1 BHK with 2200 sq.ft, First & Second floor Slab laid 2200 sq.ft Each floor and Pent house 1030 sq.ft Slab laid Total square feets 7630. Per Sft. 4000/- negotiable Please Contact **+91-7382963363**. Location : 18°00'45.6"N 79°33'41.0" E (270 yards) STRICTLY NO BROKERS SERIOUS ENQUIRIES ONLY.

NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

## మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఖిలావరంగల్, మే 15: మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం మైనార్టీ గురుకుల పాఠశాలల అడ్మిషన్ల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో మూడు బాలుర గురుకుల పాఠశాలలు, రెండు బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూవో రమేశ్, ఆర్‌ఎల్సీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీపాల, భిక్షపతి, రాజు, కృష్ణకుమారి, నీలిమా పాల్గొన్నారు.

## 'వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు'

నల్లబెల్లి, మే 15: వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముప్పు కృష్ణ హెచ్చరించారు. 15 నెలలుగా మండలంలోని చెరువులు, కుంటలు, కెనాల్ కాల్వల కట్టలను కొందరు తోడేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మండలంలోని ముచ్చింపుల శివారు వెంకటపాలెం చెరువులో కొందరు వ్యక్తులు జేసీబీతో 10 నుంచి 15 ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పోలీసుల సహకారంతో మట్టి అక్రమ దందాను నివారిస్తున్నారు. ఈ సందర్భంగా మట్టి తరలిస్తున్న వ్యక్తులకు గురువారం అవగాహన కల్పించారు. మండలంలో చాలామంది వ్యక్తులు చెరువుల నుంచి మట్టిని తరలిస్తూ తనను మానసికంగా వేధిస్తున్నారని, విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు.

## నిత్యావసరాల అందజేత

రాయపర్తి, మే 15: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన చెలుమల మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, చేరికల కమిటీ మండల కన్వీనర్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో బాధిత కుటుంబానికి గురువారం 50 కిలోల బియ్యం, వంట నూనె, నిత్యావసర సరుకులు అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి, చందు రామ్‌యాదవ్, తేరాల యాకయ్య, రాజు, నాయకులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి**

ఖానాపురం, మే 15: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలకేంద్రం శివారులో గురువారం జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేటకు చెందిన జక్కుల రవి(36) వ్యక్తిగత పని కోసం ద్విచక్ర వాహనంపై ఖానాపురం వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి భూపతిపేటకు వెళ్తున్న క్రమంలో పెద్దమ్మగడ్డ తండా శివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మ, 4 నెలల కుమారుడు ఉన్నారు. ఎస్సైని వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

**'సుందరీమణుల కాళ్లు కడిగించడం నేరం'**

వరంగల్ చౌరస్తా, మే 15: వరంగల్ పర్యటనకు వచ్చిన ప్రపంచ సుందరీమణుల కాళ్లు కడిగించడం నేరంగా పరిగణించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్ సందర్శనకు వచ్చిన పోటీదారులకు స్థానిక మహిళలతో కాళ్లు కడిగించడాన్ని తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టినట్లుగానే భావిస్తామని స్పష్టం చేశారు. పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత అధికారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మహిళా లోకాన్ని చైతన్యవంతం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**చిలుకమ్మనగర్‌లో బోరుబండి పట్టివేత**

ఖానాపురం, మే 15: చిలుకమ్మనగర్ శివారు పోడు భూముల్లో బోరు వేస్తున్న వాహనాన్ని గురువారం అటవీ అధికారులు పట్టుకున్నారు. కొద్ది రోజులుగా బోరుబండి యజమానులు అక్రమంగా బోర్లు వేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌ఆర్వో వజహత్ ఆధ్వర్యంలో కొత్తగూడ అటవీ అధికారులు బోరుబండిని పట్టుకుని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.



అటవీ అధికారులు పట్టుకున్న బోరుబండి

## కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**



మరమ్మతులు చేయిస్తున్న తహసీల్దార్

నల్లబెల్లి, మే 15: మండలకేంద్రంలోని దళిత కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు గురువారం అధికారులు చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్యపై ఈ నెల 14న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ముప్పు కృష్ణ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సమస్యను వెలుగులోకి తెచ్చిన నమస్తే తెలంగాణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహమూర్తి, మిషన్ బగీరథ ఏఈ ప్రభావతి, ఏపీవో వెంకటనారాయణ, కార్యదర్శి ధర్మేందర్ పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించం: ఏసీపీ



గ్రామస్తులను విచారిస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నల్లబెల్లి, మే 15: చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించమని ఏసీపీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని మూడుచెక్కలపల్లెలో ఇటీవల బానోత్ కొమ్మాలు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితులను రిమాండ్‌కు తరలించారు. అయితే, హత్యకు గురైన వ్యక్తితోపాటు హత్య చేసిన వ్యక్తి దగ్గరి బంధువులు కావడంతో నెల రోజుల నుంచి గ్రామంలో నిత్యం కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఏసీపీ రవీందర్‌రెడ్డి గురువారం మూడుచెక్కలపల్లెను సందర్శించి హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని ఆయన స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది హెచ్చరించారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఏసీపీ వెంట ఎస్సై గోవర్ధన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మరమ్మతులు చేయండి మహాప్రభో..

**అస్తవ్యస్త రోడ్డుతో కాలనీవాసుల అవస్థలు**

నర్సంపేట, మే 15: సీసీరోడ్డు మాట దేవుడెరుగు.. కనీసం మట్టి రోడ్డుతో మరమ్మతులు చేయండి మహాప్రభో అంటూ నర్సంపేట 18వ వార్డులోని ఓ కాలనీ వాసులు వేడుకుంటున్నారు. మట్టి రోడ్డు కూడా సరిగాలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 18వ వార్డులో సుమారు 30 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడింది. 600 మీటర్ల పొడవు కలిగిన ఈ కాలనీలో సుమారు 12 కుటుంబాలు ఉంటున్నాయి. ఇటీవల ఓ కాంట్రాక్టర్ కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా సైడ్‌డ్రైన్ నిర్మాణంతోపాటు కల్వర్టు చేపట్టాడు. ఈ కల్వర్టు మట్టి రోడ్డుకు ఫీటున్నర ఎత్తులో ఉంది. కనీసం ర్యాంప్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనాలు ర్యాంప్ పైకి ఎక్కాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నుంచి సైడ్‌డ్రైన్ నిర్మాణం ఫీట్‌కు పైకి ఉండడంతో చిరుజల్లులకే రహదారి మొత్తం బురదమయంగా మారుతున్నది. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నర్సంపేట 18వ వార్డులోని కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు